క్లుప్తంగా

చావలిపాడులో ఉపాధి పనులు



మండవల్లి: మండలంలోని చావలిపాడు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులు నిర్వహించారు. రూ.లక్షా 24 వేల అంచనా విలువతో 53 మంది ఉపాధి కూలీలు గ్రామంలో పంటబోదె పనులు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏపీఓ ఎన్.నవీన్ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. తాగునీరు, సాగునీటి సమస్యలు తీరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ఠ



భూషణగుళ్ళ (పెదపారుపూడి): మండలంలోని భూషణగుళ్ళ గ్రామంలో కోదండ రామ స్వామి ఆలయంలో సాయి బాబా నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల మధ్య బాబా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయి గీతాలు, సాయి పారాయణం, సాయి భజన చేశారు.

సుబ్బారాయుడికి లక్ష మల్లెల కుసుమార్చన



ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం –చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెల కుసుమార్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి 11మంది రుత్వికుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెల కుసుమార్చన కనులపండువగా జరిపారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖుడు వంగా శ్రీనివాసరావు(వంశీ), ఆనందదాసు శివనాగేంద్ర పాల్గొన్నారు.

విద్యావేత్త మురళీమోహనరావుకు సన్మానం



అవనిగడ్డ: విద్యావేత్త కొండవీటి మురళీ మోహనరావుకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుధవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత సింహాద్రి బసవయ్య వర్ధంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బసవయ్య స్మృతి జ్ఞాపికను మురళీ మోహనరావుకు అందజేసి సన్మానించారు. బసవయ్య మాస్టారు చేసిన సేవలను ఎమ్మెల్యే సింహాద్రి కొనియాడారు. హెడ్ పోస్టు మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్, నవజీవన్ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వర రావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది చిన్నా, కాంట్రాక్టర్ సింహాద్రి లంకేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ ప్రత్యేక పూజలు



పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానాన్ని ఏపీ పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.సూర్యకుమారి బుధవారం సందర్శించారు. కమిషనర్ సూర్యకుమారి ఆలయంలో శ్రీస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సాగర్ పూజలు చేశారు. పూజల అనంతరం కమిషనర్ సూర్యకుమారికి ఏపీ ధార్మికపరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆలయ చిత్రపటాన్ని అందజేశారు.

డంప్ యార్డును ప్రక్షాళన చేస్తాం

ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: ఏళ్ల తరబడి చెత్త పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న పురపాలక సంఘ డంప్ యార్డు పూర్తి ప్రక్షాళన చేస్తామని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ డంప్‌యార్డులో ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన లెగసి వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ (డస్ట్ గ్రేడింగ్ మిషన్)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి పట్టణ జనాభా పెరగడం, దాంతో పాటు వ్యర్థాలు పెరగడంతో 4.8 ఎకరాల డంప్‌యార్డు పూర్తిగా నిండిపోయిందన్నారు. కొన్నిసార్లు వేసవిలో నిప్పంటించడం వలన పొగతో ఈ ప్రాంతం నిండిపోవడం, వర్షాకాలం కుళ్లి దుర్గంధం వెదజల్లడం వంటి ఇబ్బందులకు స్థానిక ప్రజలు గురయ్యారన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.4 కోట్లు కేటాయించి ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సుమారు 50,930 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఇక్కడ మేట వేసుకుపోయాయని అంచనా అని, వీటిలో ప్లాస్టిక్, గుడ్డపేలికలు, ఇనుము, గాజుపెంకులు, చెక్కముక్కలు, వివిధ దశల్లో బయటకు తీస్తారన్నారు. వీటిని జిందాల్ వంటి ప్రైవేట్ కంపెనీలకు తరలిస్తే వాటిని తిరిగి వినియోగంలోకి తెస్తారన్నారు. ఈ కార్యక్రమం మొత్తం 5 నుంచి 7 నెలల్లో పూర్తిచేసేలా అంగీకారం కుదుర్చుకున్నామని వాతావరణం అనుకూలిస్తే రోజుకు సుమారు 10 నుంచి 15 లారీల వ్యర్థాలు బయటకు తరలిస్తామన్నారు. ఇది పూర్తయిన అనంతరం ఒక ఎకరా డంప్ యార్డుకు కేటాయించి మిగిలిన 3 ఎకరాల డంప్ యార్డును అందమైన ఉద్యానవనంగా తయారుచేయడం తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ ఇంజినీర్ (ఇన్‌చార్జ్) ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ మండలం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదే చంద్రబాబు విజన్...

గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో డంప్‌యార్డు నుంచి దుర్గంధం వెదజల్లేది. డంప్‌యార్డుకు నిప్పు పెడితే టెలిఫోన్ నగర్ వాసులంతా పొగతో ఇబ్బందిపడుతున్నామంటూ చంద్రబాబు పర్యటనను అడ్డుకోగా వెంటనే స్పందించిన చంద్రబాబు నాయుడు గోడ కట్టండి సమస్య పోతుందని ప్రహరీ నిర్మించారన్నారు. ప్రహరీ నిర్మించినంత మాత్రాన దుర్గంధం, పొగ వ్యాప్తి ఆగుతుందా అని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రశ్నించారు. ఇదే చంద్రబాబు నాయుడు విజన్ 2020 అని ఎద్దేవా చేశారు.

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న, సిబ్బంది



గుడివాడలో పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు

తోట్లవల్లూరు: పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని, దానికి దూరంగా ఉండాలని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు శరీరంలోని అన్ని అవయవాలను నాశనం చేస్తుందని డాక్టర్ సాయిప్రసన్న తెలియజేశారు. పొగాకు వలన గుండె, ఊపిరితిత్తుల సమస్యలు రావటంతో పాటు క్యాన్సర్ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలన్నారు. డాక్టర్ మాధవి, సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెచ్‌వీ రోహిణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడలో...

గుడివాడటౌన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. పొగాకు, పొగాకు ఉత్పత్తులు వాడటం వలన మనిషి తన జీవితాన్ని కోల్పోతాడని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి అన్నారు. ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగులు, రోగులతో పొగాకు, పొగాకు ఉత్పత్తులు తాము కాని, తమ కుటుంబ సభ్యులం కాని వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ తాలూకా యూనిట్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ బాషా, ఆసుపత్రి వైద్యులు, వైద్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

కూచిపూడి(మొవ్వ): మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడి పంచాయతీ కార్యాలయం నుంచి ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు కలిసి ర్యాలీని నిర్వహించి పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఖైనీ, గుట్కా, సిగరెట్ లాంటి పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి జీవితాన్ని బలి చేసుకోవద్దని, పొగాకు క్యాన్సర్ కారకం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ దాసరి శ్రీలక్ష్మి, హెచ్‌వీ విజయకుమారి, సీహెచ్‌వో కె.దివ్య, ఆరోగ్యకార్యకర్త కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తి అరెస్టు

ముదినేపల్లిరూరల్: యువతిని మోసగించిన వ్యక్తిని స్థానిక పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్ఐ షణ్ముఖసాయి కథనం ప్రకారం మండలంలోని అల్లూరుకు చెందిన కరేటి విశాలబాబు అదే గ్రామానికి చెందిన వరుసకు మేనకోడలు అయ్యే యువతిని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక వాంఛ నెరవేర్చుకుని మొహం చాటేశాడు. దీనిపై విశాలబాబును పలుమార్లు నిలదీసినప్పటికీ పెళ్లి చేసుకునేందుకు తిరస్కరించాడు. దీంతో యువతి స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నేడు పీఏసీఎస్ నూతన భవనాలు ప్రారంభం

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): పెదకమ్మవారిపాలెం, ఏటిమొగ గ్రామాల్లో కేడీసీసీ బ్యాంక్ నిధులతో నిర్మించిన పీఏసీఎస్ నూతన భవనాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం ప్రారంభిస్తారని సీఈఓలు కేవీ రామాంజనేయులు, విజయభాస్కర్ బుధవారం తెలిపారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన ఉదయం గం.8.09 లకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. కేడీసీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు హాజరవుతారు.

తీరప్రాంత గ్రామాల్లో అధికారుల పర్యటన

కోడూరు: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో మండల పరిషత్, పంచాయతీ అధికారులు బుధవారం పర్యటించారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని ఎంపీడీఓ పాండురంగరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి హంసలదీవి, పాలకాయతిప్ప, జరుగువానిపాలెం, మందపాకల, దింటిమెరక గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి సమస్య అధికంగా ఉందంటూ ప్రజాప్రతినిధులు చెప్పడంతో ఆయా గ్రామాల్లోని అన్ని రక్షిత మంచినీటి చెరువులను, ఫిల్టర్ బెడ్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అనుసరించాల్సిన చర్యలపై చర్చించారు. మౌలిక వసతుల కల్పనకు ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్ నుంచి అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

పేకాట శిబిరాలపై దాడులు

కంకిపాడు: పేకాట శిబిరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి కథనం మేరకు... విశ్వసనీయ సమాచారం మేరకు కంకిపాడు ప్రాంతంలో దాడి చేయగా నలుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన దాడిలో ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.2040 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం



అగినపర్రులోని దేవస్థానాల్లో ప్రతిష్ఠ చేసిన ధ్వజ స్తంభాలు

పమిడిముక్కల: అగినపర్రు గ్రామంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ, శ్రీ గంగా పార్వతీ సమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో శిఖర, ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని మచిలీపట్నంకు చెందిన రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి జరిపించారు. ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9.30 నుంచి మహా పూర్ణాహుతి, శాంతికల్యాణ మహోత్సవం జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మణిరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యలమంచలి గణేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై అభాండాలు తగదు

కొల్లు రవీంద్ర తీరుపై మైనార్టీ నాయకుల ఆగ్రహం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇంగ్లిషుపాలెం జెండా సెంటర్ వద్ద గత ఆదివారం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణను వైఎస్సార్ సీపీకి ఆపాదించడం మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు అన్నారు. స్థానిక రామానాయుడుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా మాట్లాడారు. పాత కక్షల నేపథ్యంలో యువకుల మధ్య తలెత్తిన ఘర్షణను వైఎస్సార్ సీపీకి, మసీదు కమిటీకి కొల్లు రవీంద్ర ఆపాదించడాన్ని తప్పుపట్టారు. మసీదు కమిటీ ప్రతినిధులకు ఈ ఘర్షణలో ఎలాంటి సంబంధం లేకపోయినా సంబంధం ఉన్నట్లుగా రవీంద్ర ఆరోపించారని విమర్శించారు. ప్రతి ఘటనకు వైఎస్సార్ సీపీని ఆపాదిస్తూ బురదజల్లే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా మాట్లాడుతూ రాజకీయాల కోసం ప్రతి ఘటనను ఉపయోగించుకోవడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. జెండా సెంటర్ వద్ద జరిగిన వివాదాన్ని మసీదు వద్ద జరిగినట్లుగా కొల్లు రవీంద్ర ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. ఇంగ్లిషుపాలెం గౌసియా మసీదు అధ్యక్షుడు మొహమ్మద్ ఉమర్ మాట్లాడుతూ ఈ ఘటన మసీదు వద్ద జరగలేదని అయినా కొల్లు రవీంద్ర ఈ ఘటనలో తనపై కూడా దాడి చేసినట్లుగా ప్రచారం చేశారని, దీనిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ 15వ డివిజన్ ఇన్‌చార్జి మొహమ్మద్ రఫీ, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కరార్‌మోసవి, కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

పమిడిముక్కల: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కొనియాడారు. వీరంకిలాకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మండలంలోని పమిడిముక్కల, చోరగుడి, కృష్ణాపురం, మేడూరు, వీరంకి, అగినపర్రు, లంకపల్లి, ఐనపూరు, అలీనఖీపాలెం సచివాలయాల వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉత్తమ వలంటీర్లకు ప్రభుత్వం అందజేసిన సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నాలుగేళ్లుగా పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశారని, నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. వలంటీర్లు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, పేదలు పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాప్రవీణ్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు పాతూరి చంద్రపాల్, బొల్లా రాంబాబు, తిరుమలరావు, ఎం.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు

ఎమ్మెల్యే డీఎన్నార్



ఆటపాకలో పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలను అందిస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ఆటపాక గ్రామంలో 100 గజాలలోపు క్రమబద్ధీకరణ చేసుకున్న 33 మందికి, 100 గజాలపైన ప్రభుత్వ భూమిలో నివసిస్తున్న 42 కుటుంబాలకు గజానికి ప్రభుత్వం నిర్ణయించిన నగదు చెల్లించి క్రమబద్ధీకరణ నోటీసులు, మరో 38 మందికి పొజిషన్ పత్రాలు, 13 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి గ్రామంలో స్థలాల లభ్యత లేకుంటే కైకలూరులో పంపిణీ చేస్తామన్నారు. నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పట్టపు బాలమ్మ, లక్ష్మి, ఉప సర్పంచ్ బావిశెట్టి పాములు, గ్రామ నాయకులు కన్నా రమేష్, సింగంశెట్టి రాము, కన్నా బాబు, సాంబయ్య, ముక్కెళ్ళ పెద్దిరాజులు, రామిశెట్టి బుజ్జి, వడ్లాని సుబ్బారావు, వేల్పూరి చంద్రయ్య, చిలిముంత అర్జునరావు, చిలిముంత శ్యామల రావు, పొన్నూరి జగన్, సిద్ధాబత్తుల శ్రీరామమూర్తి, తమ్మిశెట్టి కొండ, పత్తి శ్రీను, షేక్ ఆసిఫ్, చిలిముంత రవి, చొప్పాల రాము, వేల్పూరి నాగేశ్వరరావు, కోలా రమేష్, డెప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, వీఆర్వో కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం



సర్వాలంక భూషితులైన స్వామివారి ఉత్సవ మూర్తులు

గుడ్లవల్లేరు: భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరిగే అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేందుకు ఈ కల్యాణం ఉపయోగపడుతుందని వేద పండితులు తెలిపారు. కల్యాణానికి ముందు వ్యవస్థాపక ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి నివాసం నుంచి పూజా సామగ్రిని ప్రత్యేక వాహనంలో మేళతాళాలతో తీసుకొచ్చారు. ప్రత్యేక కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కనులారా గాంచారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందించారు.

విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ



మండవల్లి గ్రంథాలయంలో ఫొటో ఫ్రేములు తయారు చేస్తున్న విద్యార్థులు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పిల్లలకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చి, పిల్లలతో ఫొటో ఫ్రేములు తయారుచేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విజ్ఞానాన్ని సాధించి ఎందరో మహానుభావులు ఉన్నత శిఖరాలు చేరి, ఆదర్శప్రాయులయ్యారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రకాల యాక్టివిటీస్‌పై అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. అధిక సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ముదినేపల్లిరూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు మేఘన పలు సామాజిక అంశాల గురించి విద్యార్థులకు వివరించి వాటిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. నీతికథలు చదివించి చిత్రలేఖనం పోటీలు, క్యారమ్స్, చెస్, లూడో ఆటలు ఆడించి బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

కవితలపై దృష్టి పెట్టండి

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం కథలు, కవితలపై శిక్షణ ఇచ్చారు. తెలుగు భాషా వికాస పరిషత్ సమన్వయ కర్త డీఆర్‌బీ ప్రసాద్ చిన్నారులకు కథలు చెప్పి కవితలు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు పి.శాంతి, వి.సునీత పాల్గొన్నారు.

చెరువు తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

పెడన: ఉరివి గ్రామంలో రెండు ఎకరాల్లో చేపల చెరువు తవ్వకం పనులు ప్రారంభించగా పనులను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. దీనిపై భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయించారు. భూ యజమాని, గ్రామస్తులను స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించారు. రైతులు మాట్లాడుతూ చెరువు తవ్వకం వల్ల చుట్టూ ఉన్న పంట పొలాలు దెబ్బతింటాయని, ఈ విషయాన్ని గతంలో మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి పనులు నిలిపివేయించారని చెప్పారు. మంత్రి చెప్పినా వినిపించుకోకుండా పనులు చేయడం ప్రారంభించడంతో పనులను అడ్డుకున్నామని, రైతుల గోడు పట్టించుకోకుండా ఏ విధంగా అనుమతులు ఇస్తారంటూ రైతులు ప్రశ్నించారు. అన్ని అనుమతులు ఉన్నాయని, అందువల్లే చెరువు తవ్వకం పనులు ప్రారంభించామని సదరు యజమాని పోలీసులకు తెలిపారు. ఇరువర్గాల వారితో మాట్లాడామని, అనుమతులు పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉదయం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కృష్ణాపురం గ్రామానికి చెందిన కోట మురళీధర్ దంపతులచే అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం కనులపండువగా నిర్వహించారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, కలశాలలోని జలాలతో స్వామివార్లకు అభిషేకాలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో నాగిరెడ్డి



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి దంపతులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, బాలకృష్ణ శర్మ, మణిదీప్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వేట నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలి

కోడూరు: వేట నిషేధాజ్ఞలను మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పాలకాయతిప్ప, ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి గ్రామంలో మత్స్య శాఖాధికారులు ఆకస్మికంగా పర్యటించారు. కేంద్రం ప్రభుత్వం విధించిన వేట నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సత్యనారాయణ హెచ్చరించారు. మరో పదిహేను రోజుల పాటు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని, మత్స్యకారులంతా సహకరించాలని సూచించారు. వేటకు అవసరమైన వలలను సిద్ధం చేసుకోవడంతో పాటు బోట్లకు మరమ్మతులు చేసుకోవాలన్నారు. అనంతరం బోట్ల వివరాలను అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఎఫ్ఏ నరేంద్ర పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై కళాకారుల ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకంతో జరిగే నష్టాలను వివరిస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను అమరావతి కల్చరల్ ఆర్గనైజేషన్ గుడివాడ కళా బృంద సభ్యులు ప్రదర్శనలు ఇచ్చారు. నగరంలోని గాంధీబొమ్మ శివాలయం సెంటర్, నాగపోతరావు సెంటర్, మార్కెట్ సెంటర్‌లో కళా జాతా ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శనలో కళాకారులు వీరయ్య, రవిజీత పాల్గొన్నారు.